క్లుప్తంగా...

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

బోడుప్పల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా 33/ 11 కేవీ ఇందిరానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ఎన్ఎస్ కాలనీ, కమలానగర్, రాయల్ మెడోస్, బాలచిత్తారినగర్, రాజలింగం కాలనీ, మహాలక్ష్మినగర్, అమ్మసాని వెంకట్‌రెడ్డినగర్, పద్మావతి కాలనీ, అంజయ్య ఎన్‌క్లేవ్, సూరజ్‌నగర్, టెలిఫోన్ కాలనీ, బాలాజీనగర్, లక్ష్మారెడ్డి కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సొంత నిధులతో సేవా కార్యక్రమాలు అభినందనీయం



చెక్కును అందజేస్తున్న మంత్రి తలసాని

కాప్రా: బీఎల్ఆర్ ట్రస్ట్ ద్వారా సొంత నిధులతో ప్రజలకు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. హబ్సిగూడకు చెందిన అయోధ్యరాజు, ఆకాంక్షతేజ కంటి సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఈ విషయం తెలియడంతో బీఎల్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బండారు లక్ష్మారెడ్డి వారి చికిత్స నిమిత్తం రూ. 1.50 లక్షల ఆర్థిక సాయాన్ని బుధవారం మంత్రి తలసాని చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా మంత్రి బీఎల్ఆర్ ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో శంకర్, చాంద్ పాషా, పవన్, భాస్కర్, నేమూరి మహేష్, జంపాల్‌రెడ్డి, శ్రీనివాస్, శేఖర్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాజమాత ఫౌండేషన్‌కు నేషనల్ అచీవర్స్ అవార్డు

బోడుప్పల్: చెంగిచర్లలోని శ్రీరాజమాత ఫౌండేషన్ చేస్తున్న సమాజ సేవను గుర్తించి మధ్యప్రదేశ్‌కు చెందిన సోషల్ పాయింట్ ఫౌండేషన్ నిర్వాహకులు నేషనల్ అచీవర్స్ అవార్డు 2023 అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరాజమాత ఫౌండేషన్ అధ్యక్షులు ఉదయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ తరఫున పేద, మధ్య ప్రజలకు చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డు అందజేశారన్నారు. అవార్డుతో బాధ్యత మరింత పెరిగిందన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి



వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

మల్లాపూర్: దివ్యాంగుల సంక్షేమానికి తనవంతుగా కృషి చేస్తానని నాచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మేడల మల్లికార్జున్‌గౌడ్ అన్నారు. బుధవారం కృషి వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు బూడిద గణేష్ గౌడ్ ఆధ్వర్యంలో మల్లికార్జున్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. వికలాంగులకు బ్యాటరీ సైకిళ్లు, బైక్‌లు, వీల్ చైర్లు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉప్పలమ్మ, యాదగిరి, శ్రీనివాస్, రామారావు, భాగ్య, మధు, నాని, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో కార్పొరేటర్ పర్యటన



శ్రీ సాయినగర్ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ సుభాష్ నాయక్

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 2వ డివిజన్ లో రెండు రోజులు గా కురుస్తున్న వర్షానికి ముంపునకు గురైన శ్రీసాయి నగర్ కాలనీలో బుధవారం స్థానిక కార్పొరేటర్ సుభాష్ నాయక్, అధ్యక్షుడు ఉపేందర్, కార్యదర్శి వెంకట్ రెడ్డితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల మధ్య నిలిచిన వర్షపు నీటిని జేసీబీ సహాయంతో తొలగించారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ఘట్‌కేసర్: వెంకటాపూర్ శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను బుధవారం ఆలయ చైర్మన్ వేణుగోపాల్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఈ నెల 4–8 వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. 5న శ్రీ అలివేలుమంగ సహిత శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

నాలుగేళ్లుగా నరకం..

- రెండు కిలో మీటర్ల రహదారిలో వాహనదారుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



ఆదిత్యా ఆసుపత్రి వద్ద...

ఉప్పల్: ఉప్పల్ వరంగల్ జాతీయ రహదారిపై రెండు కిలో మీటర్ల దూరం ప్రయాణికులకు నాలుగేళ్లుగా చుక్కలు చూపిస్తోంది. వర్షం పడితే బురద, ఎండకాస్తే దుమ్ము, అపై కంకర తేలిన రోడ్లతో నిత్యం అవస్థలు పడుతున్నారు. గంటకు వేలాది వాహనాలు తిరిగే జాతీయ రహదారి అయినా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉప్పల్ నారాపల్లి ఎలివేటెడ్ కారిడార్ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు రహదారి అభివృద్ధికి నోచుకోలేదు. ప్రాజెక్టు పూర్తియితే కాని రోడ్డు పనులు చేపట్టలేమని జాతీయ రహదారి అధికారులు చెబుతున్నప్పటికీ ఏళ్లు గడుస్తున్నా కారిడార్ పనులు 50 శాతం కూడా పూర్తి కాక పోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంతాలకు పోయి ప్రాజెక్టును నిలిపివేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కారిడార్ పనులకు మోక్షం లభిస్తేనే..

కారిడార్ పనులు పూర్తయితేనే తిప్పలు తప్పుతాయని ఆయా ప్రాంతాల వాసులు భావిస్తున్నారు. జాతీయ రహదారి కావడంతో జీహెచ్‌ఎంసీ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవరిస్తున్నారు. అధికారుల మధ్య కూడా సమన్వయం లేక పోవడంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రెండేళ్లలో పూర్తికావాలి..

ఉప్పల్ టు నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ కేవలం రెండేళ్లలో పూర్తి కావాల్సి ఉండగా నాలుగేళ్లు గడిచినా కొన్ని చోట్ల పిల్లర్లు కూడా వేయలేని పరిస్థితి నెలకొంది. జూన్ 2018 న ఉప్పల్ నుంచి నారాపల్లి వరకు 6.2 కిలో మీటర్ల పొడవు, రూ. 625 కోట్ల నిధులతో కారిడార్ పనులు ప్రారంభమయ్యాయి. 2020 నాటికి పూర్తికావాల్సిన ప్రాజెక్ట్ నత్త నడకన సాగుతోంది. ఏది ఏమైనప్పటికీ తాత్కాలిక ఉపశమనంగా కనీసం రోడ్డు వేయాలని, ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ఆగమాగం అవుతున్నాం..



కాస్తా వర్షం పడితే చాలు రోడ్డు మీద నీరు నిలిచిపోతుంది. వర్షం లేక పోతే దుమ్ము లేస్తుంది. రోడ్డుపై వెళ్లే వారంతా ఆగమాగం అవుతున్నారు. ఎమ్మెల్యే పట్టించుకోడు. అధికారులకు మా అవస్థలు అర్థం కావడం లేదు.

–శివ, ఉప్పల్



ఉప్పల్ బస్టాండ్ వద్ద రోడ్డు దుస్థితి

ఇంకా ఎన్నాళ్లో



నాలుగేళ్లుగా అవస్థలు పడుతున్నాం. రోడ్డు మీదకు వెళ్లలేక పోతున్నాం. షాపులో కూర్చోలేక పోతున్నాం. రోడ్డంతా ఎక్కడా చూసినా గుంతలే. కనీసం పూడ్చుదామన్న ఆలోచన కూడా అధికారులకు రాకపోవడం సిగ్గు చేటు. నిత్యం వేలాది మంది రాక పోకలు సాగించే ఈ రహదారిని గాలికి వదిలేశారు.

–బిక్కుమల్ల సుధాకర్, ఉప్పల్ వ్యాపారి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



చిలుకానగర్‌లో అభివృద్ధి పనులకు శంకు స్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ చిలుకానగర్ డివిజన్ పరిధిలో రూ. 70 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి బుధవారం స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్‌తో కలిసి శంకు స్థాపన చేశారు. బీరప్పగడ్డ అన్నపూర్ణ కాలనీలో రూ. 17 లక్షలతో బాక్స్ డ్రైన్ నిర్మాణం, రామాలయం నుంచి శ్రీనగర్ కాలని వరకు రూ. 34 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులు, రూ. 19 లక్షల వ్యయంతో మల్లికార్జున నగర్‌లో సీవరేజ్ పైపులైన్ పనులకు ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అరుణ కుమారి,ఈఈ నాగేందర్, డిఈ నిఖిల్ రెడ్డి, ఏఈ రాజ్‌కుమార్, జలమండలి జీఎం సంతోష్ కుమార్, డీజీఎం రజినీ కాంత్, ఏఈ సత్యనారాయణ బీఆర్ఎస్ పార్టీ నేతలు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఏదుల కొండల్ రెడ్డి, పల్లే నర్సింగ రావు, తదితరులు పాల్గొన్నారు.

'స్కైవాక్ ప్రారంభానికి ఎలా వస్తావ్ ?'

ఉప్పల్: ఉప్పల్‌లో జరిగే ప్రతి అభివృద్ధి పనికి ఆటంకాలు కల్పించే పురపాలక శాఖ మంత్రి ఏ ముఖం పెట్టుకుని ఉప్పల్ స్కైవాక్ నిర్మాణం ప్రారంభానికి వస్తారని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మ్యాన్ హోల్ మరణాలు, కాలుతున్న బహుళ అంతస్తుల భవనాలు, కూలుతున్న నాలాలు, వీధి కుక్కల స్వైర విహారం, మునుగుతున్న బస్తీలు, ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ఆటంకాలు, రోడ్డుకు అడ్డుగా ఉన్న కరెంటు స్తంభాలు తీయించలేని మంత్రి ఉప్పల్ స్కైవాక్ ప్రారంభానికి ఎలా వస్తాడో ఉప్పల్‌లో ఎట్ల అడుగు పెడతారో చూస్తానంటూ హెచ్చరించారు.

మతోన్మాద బీజేపీని గద్దె దించడం ఖాయం

గౌతంనగర్: రాబోయే ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని గద్దె దింపేందుకు దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలు ఉధృతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్. బాలమల్లేష్ అన్నారు. బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో మిర్జాల్‌గూడ చౌరస్తా నుంచి ఇంటింటికి సీపీఐ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత విదేశాల్లో ఉన్న డబ్బును తీసుకువచ్చి ప్రతి దేశంలోని ప్రతి కుటుంబానికి రూ. 15 లక్షలు బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని చెప్పి తొమ్మిదేళ్లు గడిచినా హామీ కార్యరూపం దాల్చలేదన్నారు. సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి యువతను మోసం చేశారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరిస్తాం



రిజర్వాయర్ వద్ద మోటార్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: జవహర్‌నగర్ రిజర్వాయర్ పరిధిలో రిజర్వాయర్ వద్ద ఇబ్బందులు తొలగించి మంచినీటి సమస్యను పరిష్కరిస్తామని కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. జవహర్‌నగర్ రిజర్వాయర్ వద్ద మోటర్ మరమ్మతుకు గురికావడంతో ఐదు రోజులుగా మంచినీరు సరఫరా కావడం లేదని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకుని వచ్చారు. ఈ నేపథ్యంలో ఆయన డీజీఎం అశ్రిత, మేనేజర్ వేణుగోపాల్ నాయుడుతో కలిసి రిజర్వాయర్‌ను పరిశీలించారు. తాత్కాలికంగా మోటరు ఏర్పాటు చేసి మంచినీటిని సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జవహర్‌నగర్ కమిటీ సభ్యులు మల్లేష్‌గౌడ్, కృష్ణారెడ్డి, ముజీబ్, వేణుగోపాల్‌రెడ్డి, ప్రసాద్, దీప్తి, సంపత్ రావు తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు



పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: నాచారం డివిజన్‌లో నీటి ఎద్దడి లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటి సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ అన్నారు. బుధవారం నాచారం భవానీనగర్‌లో హెచ్‌డీపీ పైప్‌లైన్ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో అవసరమైన చోట మట్టిపైప్‌లు తొలగించి హెచ్‌డీపీ పైప్‌లైన్లు ఏర్పాటు చేసిస్తున్నామన్నారు. తాగునీటిలో మురుగు నీరు కలువకుండా చర్యలు తీసుకుంటున్నామని, లో ప్రెషర్ సమస్య నివారణకు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, సాంబశివరావు, రాంరెడ్డి, సుధాకర్‌రెడ్డి, నర్సింగ్‌రావు, కాశీదాస్, రమేష్, శ్రీరామ్ సత్యనారాయణ, లైన్ మెన్‌లు బాబు, మహేష్, మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

బాలికను పనిలో పెట్టుకున్నందుకు కేసు నమోదు

మేడిపల్లి: మైనర్ బాలికను పనిలో పెట్టుకున్నందుకు ఓ కంపెనీ నిర్వాహకులపై కేసు నమోదు చేసిన సంఘటన బుధవారం మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బోడుప్పల్ మల్లాపూర్ రోడ్డులోని పాపడాల కంపెనీలో 16 ఏళ్ల బాలికను పనిలో పెట్టుకున్నారని చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫిర్యాదు చేయడంతో మేడిపల్లి పోలీసులు జువెనైల్ జస్టిస్ కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. బాలికను రక్షించి హోంకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా శ్రీ సాయినాథ విగ్రహ ప్రతిష్ఠాపన



పూజల్లో పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి తదితరులు

ఘట్‌కేసర్: కొర్రెముల్‌లో డీసీపీ జగన్ ఏసీపీ లక్ష్మీ దంపతులు, మాజీ సర్పంచ్ నాగరాజు నీరజ దంపతులు తమ సొంత నిధులతో నిర్మించిన ఆలయంలో శ్రీసాయినాథ విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పంచామృత అభిషేకం, సింధూర అలంకారం, మూలమంత్ర విధానేన హోమంలో మంత్రి మల్లారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంటకేశ్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మయ్య, వాసు శర్మ, విశ్వనాథం, సత్యనారాయణ, రవి, ఆనంద్, ముఖేశ్‌కుమార్, వార్డు సభ్యులు దుర్గరాజ్, భాస్కర్, బాబు, స్వామి, నేతలు రమేశ్, మహేంద్ర చారి, సుదర్శన్, యాదగిరి, నాగేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షప్రధాన కార్యదర్శి రమేశ్, కొండల్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

దమ్మాయిగూడ: కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం ప్రజలు చేసుకోవాలని దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్ అన్నారు. బుధవారం ఉదయం మున్సిపాలిటీ పరిధిలోని 18 వ వార్డులో బస్తీ దవాఖాన వద్ద ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. 170 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 21 మందికి కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు వైద్యులు తెలిపారు.

అమ్మవార్లను ఆరాధిస్తే సకల శుభాలు



రేణుక ఎల్లమ్మ గుడికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి

రామంతాపూర్ : ఎల్లమ్మ, మైసమ్మ, మహంకాళి అమ్మవార్ల ను ఆరాధిస్తే దుష్ట శక్తులు దూరమై అన్నీ శుభాలే కలుగుతాయని ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి అన్నారు బుధవారం ఆయన శ్రీరమణపురం కాలనీలో రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని టీఆర్ఎస్ ప్రభుత్వం బోనాల ఉత్సవాల వేడుకల సందర్భంగా అమ్మవార్ల ఆలయాలకరు భారీగా నిధులు అందజేస్తూ ఉత్సవాలు వైభవంగా జరిగేందుకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గోడబోయిన సాయిలు, అద్దంకి యాదగిరి, బోస శ్రీను, కొత్తూరు సాయిబాబా, రాజు, రాఘవేందర్, గడ్డం రవికుమార్, గరికె సుధాకర్, నందికంటి శివ తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యం



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న మేయర్ జక్కా వెంకట్ రెడ్డి తదితరులు

మేడిపల్లి: అంధత్వ నివారణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి అన్నారు బుధవారం 2వ విడత కంటివెలుగు కార్యక్రమాన్ని కార్పొరేషన్ పరిధిలోని 25వ డివిజన్ శ్రీసాయి నగర్ కాలనీ కమ్యునిటిహాల్‌లో స్థానిక కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హరిశంకర్ రెడ్డి మాట్లాడుతూ.. కంటి సమస్యలతో బాధపడుతున్నవారు కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మంజుల రవీందర్, అనంత రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జానకి, కాలనీల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

మేడిపల్లి: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వం రూ.వెయ్యి వేతనం పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తూ పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బుధవారం ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పారిశుద్ధ్య కార్మికులతో కలిసి మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మేయర్ జక్కా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రికి పారిశుద్ధ్య కార్మికులు రుణపడి ఉంటారన్నారు. మూడు పర్యాయాలు పారిశుద్ధ్య కార్మికుల వేతనాలను పెంచి కార్మిక పక్షపాతిగా రుజువు చేసుకున్నారన్నారు. కార్మికుల కష్ట సుఖాలు తెలిసిన వ్యక్తి ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్ అని కొనియాడారు.

ముంపు నివారణకు కట్టుదిట్టమైన చర్యలు





మీర్‌పేట్-హెచ్‌బీ కాలనీ డివిజన్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్

కాప్రా: నగరంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో మీర్‌పేట్–హెచ్‌బీ కాలనీ డివిజన్‌లోని లోతట్టు కాలనీల్లో నీరు నిలువకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ తెలిపారు. బుధవారం డివిజన్‌లోని పలు కాలనీల్లో మున్సిపల్ అధికారులతో కలిసి పర్యటించారు. వాతావరణ మార్పుల కారణంగా ప్రజలు విషజ్వరాల బారిన పడే ప్రమాదం ఉందని, నీటినిల్వలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలు కూడా తమ పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, హైదరాబాద్ మెట్రో వాటర్‌వర్క్స్ డైరెక్టర్ స్వామి, వాటర్ వర్క్స్ మేనేజర్ వేణుగోపాల్, ఈడీ రూప, ఏఈ స్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ చారి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

గ్రామ దేవతలు సంప్రదాయాలకు ప్రతీక



భూమిపూజలో పాల్గొన్న రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు

ఉప్పల్: గ్రామ దేవతలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నేత గంధం నాగేశ్వర్ రావు అన్నారు. రామంతాపూర్ శ్రీరమణపురం కాలనీలో బుధవారం జరిగిన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయ భూమి పూజ కార్యక్రమానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి తన వంతు రూ.50 వేలు విరాళంగా ఇస్తున్నట్లు లక్ష్మారెడ్డి ప్రకటించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు గూడ బోయిన సాయిలు, అద్దంటి యాదగిరి, పూస శ్రీను,కొత్తూరు సాయిబాబా, బొల్లి రాజు, వంజరి సంతోష్ పాల్గొన్నారు.

సమాజం పట్ల బాధ్యత అవసరం



ఏఐవైఎఫ్ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నేతలు

కాప్రా: యువత సమాజం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలి ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సత్యప్రసాద్ అన్నారు. బుధవారం కమలానగర్‌లోని నీలం సంజీవరెడ్డి భవన్‌లో ఏఐవైఎఫ్ 64వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య, వైద్యం, ఉపాధి హక్కుల సాధన కోసం ఏఐవైఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. ప్రస్తుత పాలకులు రాజకీయాల కోసం యువతను చెడు మార్గంలో పయనించేలా చేస్తున్నారని ఆరోపించారు. యువతకు ఉపాధి కల్పించాలనే నినాదంతో ఏఐవైఎఫ్ ఉద్యమిస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భగత్‌సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కాసర్ల నాగరాజు, సందీప్, కిషోర్, కృష్ణారెడ్డి, సల్మాన్ బైగ్, ఇమ్రాన్ ఖాదీర్, యాస్మిన్, కిరణ్మయి, సింధు, పావని తదితరులు పాల్గొన్నారు.